క్లుప్తంగా

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు షాహీరా



తెనాలిఅర్బన్: రాష్ట్రస్థాయి అండర్–19 నెట్‌బాల్ పోటీలకు తెనాలి కొత్తపేటలోని బాయ్స్ హైస్కూల్ విద్యార్థిని షేక్ షాహీరా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు షేక్ మాలాబీ తెలిపారు. చిలకలూరుపేటలోని ఏఎంజీ జూనియర్ కళాశాలలో శనివారం ఎంపిక జరిగిందని చెప్పారు. విద్యార్థిని పాఠశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు టి.ప్రసాదకుమారి, కొడాలి గోవర్ధన, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌బీ ప్రొఫైలింగ్ యాప్‌పై అవగాహన ఉండాలి



తెనాలిఅర్బన్: ఎస్‌హెచ్‌బీ ప్రొఫైలింగ్ యాప్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయ అధికారి ఐబీ పద్మజ సూచించారు. పురపాలక సంఘ కార్యాలయంలోని మెప్మా షెడ్డులో శనివారం స్మాల్ లెవల్ ఫెడరేషన్ రిసోర్స్‌పర్సన్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయ సంఘ సభ్యుల వివరాలను యాప్‌లో పొందుపరచాలని సూచించారు. అలాగే వారి రుణాలకు సంబంధించిన వివరాలను కూడా దానిలో నమోదు చేయాలని సూచించారు. దీనికి సంఘ సభ్యులందరూ సహకరించాలని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి, సీఎంఎం జి.విజయకుమారి, సీవోలు, ఆర్పీలు, డీఈవోలు పాల్గొన్నారు.

డివైడర్‌కు ఢీకొని ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు



తెనాలిరూరల్: డివైడర్‌కు ఢీకొని ఆటో డ్రైవర్ తీవ్ర గాయాలపాలైన ఘటన తెనాలి వైకుంఠపురం వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా వైమూరు పంచాయతిలోని బేతేలుపురంకు చెందిన చాగలమర్రి వినోద్ తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో తెనాలికి తన ఆటోలో వస్తున్నాడు. వైకుంఠపురం వద్ద నిద్రమత్తులో డివైడర్‌కు ఢీకొని ఆటో తిరగబడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108లో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం మంగళగిరి ఎన్ ఆర్‌ఐ వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యశాల నుండి సాయంత్రం వచ్చిన సమాచారం మేరకు త్రీ టౌన్ ఎస్‌ఐ నక్కా ప్రకాశరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘ఆళ్ల’కు హృదయభారతి సాహితీ సేవాపురస్కారం

8న హైదరాబాద్‌లో ప్రదానం



తెనాలి: పట్టణానికి చెందిన కవి, రచయిత, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావు, హైదరాబాద్‌కు చెందిన హృదయ భారతి చారిటబుల్ ట్రస్ట్ సాహితీ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. అక్కడి బాగ్‌లింగంపల్లిలోని కళానిలయం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఈనెల 8న సంస్థ వార్షికోత్సవం, స్వర్ణపుష్పం మాసపత్రిక పుష్కరోత్సవ వేడుకల్లో జరగనున్న సాహితీ కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఆ ప్రకారం ఆహ్వానపత్రికను నాగేశ్వరరావు అందుకున్నారు. ఆర్టీసీ గుంటూరు–2 డిపోలో కండక్టరుగా విధులు నిర్వర్తిస్తున్న నాగేశ్వరరావు, ప్రవృత్తిగా నాలుగు దశాబ్దాలుగా సాహితీసేద్యంలో ఉన్నారు. వివిధ ప్రక్రియల్లో సామాజిక చైతన్యవంతమైన రచనలను చేస్తున్నారు.

మద్యం అక్రమ విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సంఘటన కారుమూరులో చోటు చేసుకుంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో కారుమూరు గ్రామంలో తమ సిబ్బంది దాడులు నిర్వహించారన్నారు. దాడుల్లో గ్రామ బస్‌షెల్టర్ సమీపంలో గ్రామానికి చెందిన సమ్మెట వెంకట్రావు మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతని వద్ద 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

వ్యక్తిపై దాడి

చందోలు(కర్లపాలెం): ఓ వ్యక్తిపై ఇరువురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచిన సంఘటన పిట్టలవానిపాలెం మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చందోలు ఎస్‌ఐ స్వామి శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు ఖాజీపాలెం పంచాయతీ మండేవారిపాలెంకు చెందిన బడుగు దీనారావుపై అదే గ్రామానికి చెందిన దండమూడి ఆశీర్వాదం, దోనేపాటి శోభన్‌లు గత నెల 31వ తేదీ రాత్రి దాడిచేసి గాయపరిచారని తెలిపారు. దీనారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



చెంచుపేటలో నిర్మించని సీసీ రోడ్డు



పినపాడు పోతురాజు వారివీధిలో నిర్మించని సీసీ డ్రైయిన్



గడప గడప నిధులతో పూర్తి అయిన యడ్లలింగయ్య కాలనీలోని సీసీ రోడ్డు

‘గడప గడపకు’ మంగళం!?

- కూటమి పాలకుల తీరు ప్రశ్నార్థకం
- 25 శాతం లోపు పూర్తి కాని పనులు రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశం
- తెనాలి పట్టణంలో 55 పనులు రద్దు
- పనుల రద్దుతో కుంటుపడిన అభివృద్ధి

తెనాలిఅర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. 25 శాతం లోపు పూర్తి కానీ పనులను వెంటనే రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ ఇటీవల ఆదేశించారు. దీంతో తెనాలి పట్టణంలో టెండర్ల దశలో ఉన్న ఆరు వర్కు పనులు, 25 శాతం లోపు పూర్తి కానీ ఒక పనితో పాటు ప్రతిపాదనల దశలో ఉన్న 48 పనులను అధికారులు రద్దు చేశారు. దీంతో తెనాలి పట్టణంలో అభివృద్ధి ఆమడ దూరంలో నిలచినట్లు అయ్యింది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించింది. తెనాలి పట్టణంలోని మొత్తం 40 వార్డులలో 37 వార్డులలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేశారు. గత ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వార్డుల్లో ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకోవటంతో పాటు వారు తెలియజేసిన సమస్యలను అధికారులతో నమోదు చేయించారు. వార్డులో కార్యక్రమం పూర్తి కాగానే సచివాలయంకు ప్రభుత్వం కేటాయించిన రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయించి జిల్లా కలెక్టర్ అనుమతికి పంపారు. అక్కడి నుంచి అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించి పూర్తి చేశారు.

తెనాలిలో 128 పనులకు ప్రతిపాదనలు

పట్టణంలో 37 వార్డులలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేసి 128 పనులకు స్థానిక అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా కలెక్టర్ అనుమతికి పంపారు. దీని కోసం ప్రభుత్వం రూ.8.40 కోట్ల నిధులు వెచ్చించింది. దీంతో పట్టణంలోని వివిధ మురుగు కాల్వలు, కల్వర్టులు, సీసీ రోడ్లు వంటి 73 పనులు పూర్తి చేసి వాటికి సంబంధించిన బిల్లుల కింద రూ.4.74 కోట్ల నిధులు చెల్లించారు.

కలెక్టర్ ఆదేశాలతో 55 పనులు రద్దు

తెనాలి పట్టణంలోని 128 పనులలో గతేడాది డిసెంబర్ నాటికి కేవలం 73 పనులు పూర్తి చేశారు. మిగిలిన వాటిలో ఒక పనిని ప్రారంభించి 25 శాతం లోపు పూర్తి చేశారు. మిగిలిన వాటిలో ఆరు టెండర్ల దశలోనే నిలచిపోగా, 48 పనులు ప్రతిపాదనల దశలోనే ఉన్నాయి. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావటంతో ఆ పనుల్లో అధికారులు నిమగ్నం కావడంతో వీటి పర్యవేక్షణను నిలిపివేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో వీటిని తాత్కాలికంగా ఆపివేయాలని ఆదేశాలు అధికారులకు అందాయి. దీంతో అప్పటి నుంచి పనులపై స్పష్టత కరువైంది. ఇలాంటి సమయంలో 25 శాతం పనులు పూర్తి కాని వాటిని రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. అలాగే రద్దు అయిన పనులకు సంబంధించిన పనుల జాబితాను పంపాలని సూచించారు. దీనిని బట్టి చూస్తే తెనాలి పట్టణంలో టెండర్ల దశలో ఉన్న ఆరు పనులు, 25 శాతం పూర్తి కాని ఒక పనితో పాటు 48 పనులు రద్దు చేసినట్లు తెలుస్తోంది. అలాగే వీటికోసం గత ప్రభుత్వం కేటాయించిన రూ.3.66 నిధులు వెనక్కి వెళ్లినట్లు సమాచారం.

55 పనులు రద్దు చేశాం



గడపడ గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద ప్రతిపాదనలు, టెండర్ల దశతో పాటు 25 శాతం పనులు పూర్తి కాని వాటిని రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించిన మాట వాస్తవం. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మొత్తం 55 పనులు రద్దు చేశాం. ఆ పనులను జనరల్ ఫండ్, ఇతర నిధులతో చేయిస్తాం.

–ఎ.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజనీర్, తెనాలి

పట్టణ సుందరీకరణలో భాగస్వాములు కావాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, ఏసీ లక్ష్మీపతి

తెనాలిఅర్బన్: పట్టణ సుందరీకరణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. పట్టణంలో 1,3,9 వార్డులలో శనివారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. అలాగే మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

శివాలయాలకు కార్తిక శోభ



శ్రీరామేశ్వరస్వామి ఆలయంలో స్వామికి పూజలు



క్యూలైన్లలో కిటకిటలాడుతున్న భక్తులు



కార్తికదీపాలు వెలిగిస్తున్న మహిళలు



శ్రీకోదండరామస్వామి ఆలయంలో 365 సాలగ్రామ శివలింగాన్ని దర్శించుకుంటున్న భక్తులు



శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నగరేశ్వరస్వామి



సంగమేశ్వరస్వామి ఆలయంలో హారతి తీసుకుంటున్న భక్తులు

- కిటకిటలాడిన ఆలయాలు
- కార్తిక దీపాలు వెలిగించి అభిషేకాలు చేసిన భక్తజనం

తెనాలి: హిందూ సాంప్రదాయంలో మహిమాన్వితమైన కార్తీకమాసం శనివారం నుంచి ప్రారంభమైంది. కార్తిక మాసం పరమ శివునికి అత్యంత ప్రీతిపాత్రం కూడా. దీనికి సమానమైన మాసం లేదని కూడా చెబుతారు. పవిత్ర కార్తిక మాసంలో శివారాధనతో పాటు మహా విష్ణువును పూజించడం, విశేషించి సత్యనారాయణ వ్రతం ఆచరించడం అనంత ఫలాన్ని ఇస్తుందని అంటారు. ఏటా దీపావళి మరుసటి రోజు నుంచి ఆరంభమయే కార్తిక మాసంలో వచ్చే పాడ్యమి, చవితి, పౌర్ణమి, చతుర్దశి, ఏకాదశి, ద్వాదశి తిథుల్లో శివపార్వతుల అనుగ్రహం కోసం ప్రత్యేక పూజలు చేస్తారు. శివాలయాల్లో రుద్రాభిషేకాలు, రుద్రపూజ, లక్ష బిల్వదళాలతో పూజలు, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలను భక్తిశ్రద్ధలతో చేస్తారు. నెలరోజులూ నదీ స్నానం, దానం, జపం, పూజ, ఉపవాస వ్రతాలు, దీపాలు వెలిగించడం, వన భోజనాలు చేయడంవల్ల పాప ప్రక్షాళన జరుగుతుందని భక్తులు విశ్వసిస్తారు.

ఇంతటి ప్రాముఖ్యత కలిగిన కార్తిక మాసం ప్రారంభం రోజున తెల్లవారుజాము నుంచే పట్టణ, పరిసరాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు మొదలయ్యాయి. పట్టణ గంగానమ్మపేట పేటలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీపర్వతవర్ధనీ సమేత శ్రీరామేశ్వరస్వామి దేవాలయం, మారీసుపేట, సుల్తానాబాద్, రామలింగేశ్వర పేట సహా పలు శివాలయాలు, రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడిలోని సంగమేశ్వర దేవాలయానికి భక్తులు పోటెత్తారు. పెద్దసంఖ్యలో మహిళలు తెలతెల్లవారుతూనే ఆలయాలకు చేరుకున్నారు. కార్తీక దీపాలు వెలిగించారు. వివిధ ఆలయాల్లో పరమేశ్వరునికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు ఎంతో వైభవంగా జరిగాయి. గంగానమ్మపేటలోని శ్రీ రామేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. శ్రీరామేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఎంతో విశేషంగా ద్వాదశ హారతులను ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలోని తోటలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మారీసుపేటలోని శ్రీబాలత్రిపుర సుందరీ సమేత శ్రీచంద్రమౌళేశ్వర స్వామి దేవస్థానంలో కార్తికమాసం ప్రారంభం రోజున విశేష అభిషేకాలు పూజాలు జరిగాయి. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. సుల్తానాబాద్‌లోని శివాలయంలో కార్తిక మాసం తొలి రోజును పురస్కరించుకుని స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. నెల రోజుల పాటు కార్తిక మాస పూజలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. తెనాలి మండల గ్రామం సంగంజాగర్లమూడిలోని బాల త్రిపురసుందరీ సమేత సంగమేశ్వర స్వామి దేవస్థానంలో కార్తికమాసం తొలిరోజున విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. పరిసర ప్రాంతాల నుండి భక్తులు ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. పూజలు, అభిషేకాలు చేశారు.

కార్తికమాసం పద్యకుసుమం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన వేణుగోపాలరావు

తెనాలి: పట్టణానికి చెందిన కవి, రచయిత డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు రూపొందించిన కార్తికమాసం నిత్య పద్యకుసుమం పఠన గ్రంథాన్ని శుక్రవారం రాత్రి స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆవిష్కరించారు. దేవస్థానం పాలకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ప్రచురించిన ఈ పుస్తకాన్ని కమిటీ అధ్యక్షుడు నూకల వేంకట వేణు గోపాలరావు ఆవిష్కరించారు. అందులోని పద్యాలను గానకళారత్న వెంపటి సత్యనారాయణ గానం చేశారని చెప్పారు. కార్యక్రమంలో గ్రంధి వెంకట విశ్వేశ్వరరావు, మద్దాళి శేషాచలం, వుప్పల వరదరాజులు, మాలేపాటి హరిప్రసాద్, పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి, ఈఎల్‌వీ అప్పారావు, కె.సుబ్రహ్మణ్యం, కె.శ్రీనివారావు, జి.రామకృష్ణ, ఆర్.జగదీష్ చంద్రశర్మ పాల్గొన్నారు.

రీ సర్వేతో రైతుల భూమికి హామీ

తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు



పల్లెకోనలో రీ సర్వే గ్రామ సభలో పాల్గొన్న తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు

పల్లెకోన(భట్టిప్రోలు): భూముల రీ సర్వేలో లోపాలు సవరించేందుకు రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు అన్నారు. భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామంలో శనివారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీ సర్వేలోని లోపాలను సవరించడంతో పాటు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి రైతు ఈ గ్రామ సభలు సద్వినియోగం చేసుకుని అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్రామ సభలో 6 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. సర్పంచ్ బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్, మాజీ సర్పంచులు రాయన ప్రసాదరావు, మండవ రామకోటేశ్వరరావు, మండల సర్వేయర్ బి.శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

12న సుందరాంజనేయ ఆలయ వార్షికోత్సవం



పడమటిపాలెంలోని సుందరాంజనేయ స్వామి వారి దేవాలయం

పడమటిపాలెం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం కోనేటిపురం పంచాయతీ పరిధిలోని పడమటిపాలెంలో కొలువైన సుందరాంజనేయ స్వామి ఆలయ 16వ వార్షికోత్సవం నవంబర్ 12వ తేదీన నిర్వహించనున్నట్లు దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ, విశ్రాంత ఐఏఎస్ అధికారి పడమటి సుందరకుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆ రోజు విశేష పూజలు, హనుమత్ కల్యాణం, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో 33 అడుగుల ఎత్తు గల ఈ విగ్రహాన్ని 2008లో ప్రతిష్ఠించారు. గ్రామస్తుల కోరిక మేరకు పడమటి సుందర కుమార్ విగ్రహంతో పాటు ప్రజల సహకారంతో దేవాలయాన్ని కూడా నిర్మించారు. ఈ ఆలయ ప్రారంభం నుంచి ఈ ప్రాంతం పాడి పంటలతో సుభిక్షంగా విలసిల్లుతుందని భక్తుల నమ్మకం. మహోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని సుందరకుమార్ తెలిపారు.

6 నుంచి ఎన్‌ఆర్‌ఈజీఈఎస్ గ్రామసభలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఎన్‌ఆర్‌ఈజీఈఎస్ పథకం కింద గ్రామ సభలు ఈ నెల 6 నుంచి 13వ తేదీవరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకట రమణ శనివారం తెలిపారు. 6న ఆళ్లమూడి, పల్లెకోన, రాచూరు, 7న ఓలేరు, గొరిగపూడి, కన్నెగంటివారిపాలెం, 8న పెదపులివర్రు, చింతమోటు, వెల్లటూరు, 12న కోనేటిపురం, సూరేపల్లి, ఐలవరం, 13న పెదలంక, పెసర్లంక, భట్టిప్రోలు గ్రామాలలో గ్రామ సభలు జరుగుతాయని పేర్కొన్నారు.

నేడు వేమవరంలో గ్యార్మీ గంధ మహోత్సవం

భట్టిప్రోలు: హజరత్ మహబూబ్ సుభానీ (గరీబ్ కా గ్యార్మీ, గరీబోంక గ్యార్మీ) 13వ గ్యార్మీ, గంధ మహోత్సవం ఆదివారం భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో జరుగుతుందని కరామత్ షా హజరత్ మహబూబ్ సుభానీ శనివారం తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం జరుగుతుందని, సాయంత్రం గంధం, జెండా ఊరేగింపు ఫకీర్ల మేళతాళాలతో ఊరేగింపు కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సుభాని పేర్కొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఏఐ, డీఎస్ విభాగం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం పెదవడ్లపూడి గ్రామంలో రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. నిబంధనలు పాటించనందున వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. వలంటీర్లను, ఫీల్డ్ కో ఆర్డినేటర్ పి. సురేష్‌లను వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డీన్‌లు డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి తదితరులు అభినందించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న 9 ట్రాక్టర్లు సీజ్



లింగాయపాలెం(తాడికొండ): తుళ్ళూరు మండలం లింగాయపాలెం గ్రామంలో అర్ధ రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 9 ట్రాక్టర్లను తుళ్ళూరు పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ అంకమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడులలో కేసులు నమోదు చేసి తహసీల్దార్ కోర్టులో హాజరు పరచగా.. ఒక్కో ట్రాక్టరుకు రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ అంకమ్మ తెలిపారు.